# దివ్యాకర్షణ శక్తి

మౌళిగుల్కెడు చంద్రమఃఖండ కళతోడ
బెడగారు గుల్కెడు జడలతోడ
జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ
దంబైన ఫాలనేత్రంబుతోడ
నల్లనేరెడువంటి నల్లని మెడతోడ
కరమున నాగకంకణముతోడ
నడుమును చుట్టిన నాగచర్మముతోడ
మైనిండ నలరు భస్మంబుతోడ
నుదుట తీర్చిన దొడ్డ కుంకుమ బొట్టుతో
తాంబూల రాగాధరంబుతోడ
ఆరు శాస్త్రములందున నందగించి
నల్ల కలువల హసియించి కొల్లలాడు
మెరుగు చామనచాయ మేనితోడ
శైలరాజేంద్రుడు నేడు ప్రత్యక్షమాయె

ప్రేమస్వరూపులారా! భూగోళమంతయు అయస్కాంతమయమై ఉన్నది. ఈ భూగోళముపై నివసించే సర్వజీవులూ, సమస్త పదార్థములూ అయస్కాంత స్వరూపములై ఉన్నవి. ప్రవహించే నదులు, పూసే పూవులు, వీచే గాలులు ఇవన్నీ అయస్కాంతమయమై యున్నవి. భూమియొక్క అయస్కాంతశక్తిచేతనే నదులు భూమిని ఆనుకొని ప్రవహించు చున్నవి. అయస్కాంతశక్తి సర్వత్రా నిండియున్నది. ప్రజలు భక్తిప్రపత్తులతో దేవాలయాలకు వెళుతున్నారు. ఈ భక్తిప్రపత్తులు అయస్కాంత శక్తితో కూడినవి. వేలాది భక్తులు ఈ



srisathyasaivachanamrutam

మందిరంలో ప్రవేశించడంచేత వారియొక్క అయస్కాంతశక్తి అంతయు మందిరంలో నిలిచిపోతున్నది. వారు అర్పించే పుష్పములుగాని, ఫలములుగాని అన్నీ అయస్కాంతమయమై ఉన్నవి. ఎన్నివేలమంది భక్తులు ప్రవేశించినప్పటికీ ఈ అయస్కాంతశక్తి దిన దినమునకూ పెరుగుతూనే ఉంటుందిగాని, తరగదు. అయస్కాంతక్షేత్రంలో ఒక ఇనుప ములికిని వేసినప్పుడు కొన్ని దినములకు అదికూడా అయస్కాంతమైపోతుంది. అదేవిధంగా, దేవాలయంలో ప్రవేశించే వ్యక్తులు, వారు అర్పించే పదార్థములు అయస్కాంతమయమై ఉంటాయి. మందిరమునందున్న మహత్తరమైన దివ్యశక్తులు భక్తులు గొనిపోయిన అయస్కాంత శక్తిద్వారానే ఆవిర్భవిస్తున్నవి.

ప్రతి వ్యక్తియందు అయస్కాంతశక్తి నిండియున్నది. కాని, ఆ శక్తిని మీరు గుర్తించుకోలేక, దేవాలయములందు ఏదో ప్రత్యేకమైన శక్తి ఉన్నదని భావించి ఆ శక్తిని గ్రహించడానికి ప్రయత్నిస్తున్నారు. దేవాలయముల నుండి ప్రత్యేకమైన శక్తులు ప్రాప్తించవు. మీనుండి వెళ్ళిన అయస్కాంత శక్తియే మీకు ప్రతిబింబిస్తుంది. భక్తులు తిరుపతి, హరిద్వార్, ఋషీకేశ్ మున్నగు పుణ్యక్షేత్రాలకు వెళుతుంటారు. ఆ భక్తులయొక్క భక్తిప్రపత్తులే ఆయా పవిత్ర క్షేత్రములయొక్క శక్తికి మూలకారణము. భగవంతుడు సకలైశ్వర్య స్వరూపుడు. మానవుడుకూడా సకలైశ్వర్య స్వరూపుడే. ఐశ్వర్యము, శక్తి, యశస్సు, జ్ఞానము, సంపద, వైరాగ్యము... ఇవన్నీ భగవంతుని అనుగ్రహ ప్రసాదములే. ఇవి ప్రతి మానవునియందున్నవి. కాని, వీటిని దుర్వినియోగం చేసుకోవడంచేత ఈ శక్తులను తాను కోల్పోతున్నాడు. వీటిని తాను సద్వినియోగపరచుకున్నప్పుడు దివ్యత్వము తనయందే ప్రకాశిస్తుంది. అట్టి మానవుని ముఖమునందు తేజస్సు ప్రజ్వరిల్లుతూ ఉంటుంది.

**దేహము - ప్రాణము - దివ్యశక్తి**

వెంకట్రామన్ (మాజీ వైస్ ఛాన్స్‌లర్) తన ప్రసంగంలో చెప్పినట్లుగా మెటీరియలైజేషన్, వైబ్రేషన్, రేడియేషన్ – ఈ మూడింటి స్వరూపమే మానవుడు. మెటీరియలైజేషన్ అనగా దేహము. వైబ్రేషన్ అనగా ప్రాణశక్తి. ఈ రెండింటినీ సమన్వయ పరచే ఆత్మశక్తియే



sri sathyasai vachanamrutam

రేడియేషన్. దైవమునందు ఏ శక్తులున్నవో ఆ శక్తులు ప్రతి వ్యక్తియందు తాండవమాడుచున్నవి. కాని, ఆ శక్తులపైన మానవుడు తన దృష్టిని పెట్టడం లేదు. కేవలం దేహ తత్త్వమునే దృష్టిలో ఉంచుకొని "దేహమే నేను" అని భ్రమిస్తున్నాడు. తాను దేహము కాదు. తానే దేహమైతే "ఇది నా దేహము" అని ఎందుకు చెబుతున్నాడు? తాను దేహముకంటే ప్రత్యేకంగా ఉన్నాడు కనుకనే, "నా దేహము" అంటున్నాడు. మెటీరియలైజేషన్ అయిన దేహమే తానని భ్రమించడంచేతనే మానవుడు తనలో ఉన్న దివ్యమైన కాంతిని కోల్పోతున్నాడు. ఇంక, వైబ్రేషన్ అనేది ఉచ్ఛ్వాస నిశ్వాసములకు సంబంధించినది. ఒక్కొక్క పర్యాయం "నా శ్వాస సరిగా ఆడటం లేదు" అంటాడు. "నా శ్వాస" అంటున్నాడు కాబట్టి, తాను శ్వాస కాదు. వైబ్రేషన్ కంటే తాను ప్రత్యేకంగా ఉన్నాడు. మూడవది రేడియేషన్. అదియే దివ్యశక్తి. తాను వేరు, దివ్యశక్తి వేరు కాదు. తనయందున్న అయస్కాంతశక్తియే ఈ దివ్యశక్తి. దేవాలయములందు సర్వులను ఆకర్షించేది ఈ దివ్యశక్తియే. ఆకర్షణశక్తి మందిరముయొక్క స్వభావము. ఇది ప్రతి మానవునియందు ప్రకాశిస్తున్నది.

**నాకు బాధ కాదు, అది మీకొక బోధ**

స్వర్ణము, ఇనుము ఇత్యాది అనేక లోహములు మానవునియందే ఇమిడియున్నవి. "రసోవై సః", రసముతో కూడినది ఈ దేహము. లింగోద్భవమంటే ఏమిటి? భగవంతుడు హిరణ్యగర్భుడు. తన ఉదరము హిరణ్యమయంగా ఉన్నది. ఈ రసస్వరూపమైన హిరణ్య మంతా తిరిగి తిరిగి ఒక దగ్గర చేరి లింగాకృతిని దాల్చుతుంది. లింగము అనగా చిహ్నము, ఒక గుర్తు. దీనికి కన్ను, ముఖము, నోరు... మొదలైన అంగములు లేవు. ఏది తల, ఏవి కాళ్ళు అనేది చెప్పడానికి వీలుకాదు. "లీయతే గమ్యతే ఇతి లింగః" (దేనిలో అన్నీ లీనమవునో, దేనికై అన్నీ గమించునో అది లింగము) ఇది లోపల తయారై బహిర్ముఖంగా బయలుదేరుతుంది. ఇది కరిగి లింగముగా తయారు కావాలంటే ఎంతో వేడి కావాలి. అదియే లింగోద్భవ సమయంలో కలిగే బాధ. ఇది లింగాకారము ధరించి బయటికి రావాలి. ఇది బయటికి వచ్చే సమయంలో స్వామికి బాధ కల్గుతోందని మీరు భావిస్తున్నారు.

sri sathyasai vahamrutam

కాని, ఇది బాధ కాదు. ఇది మీకొక బోధ. తల్లిగర్భమునందున్న శిశువు బయటికి రావాలంటే తల్లికి కొంత బాధ తప్పదు కదా! "అబ్బా! ఈ పాడుబిడ్డ నన్ను ఎంత బాధపెడుతోంది!" అని ఏ తల్లియైనా తిట్టుకుంటుందా? తన బిడ్డ సుక్షేమంగా ఉండాలనే ఆశిస్తుంది. అదేవిధంగా, లింగోద్భవము జరిగేటప్పుడు ఇంతమందికి గొప్ప బోధ గావిస్తున్నానని ఆనందిస్తానే గాని, అది నాకు బాధ అని నేను భావించను. కాని, కొందరు "స్వామికి ఇంత కష్టమా! ఇంత బాధనా!" అని అనుకుంటారు. దైవత్వమునకు ఎట్టి బాధలూ ఉండవు, ఎట్టి విచారములూ ఉండవు, ఎట్టి కష్టములూ కలుగవు. ఇవి తయారు కావడానికి రెండు దినములనుండి నా శరీరమంతా మ్యాగ్నెట్‌గా మారిపోయింది. నేను దేనిని ముడితే అది చేతికి కరుచుకుంటోంది. ఎక్కడ అడుగు పెడితే అక్కడ నా పాదాలు భూమికి కరుచుకుంటున్నాయి. కనుక, అడుగు తీసి అడుగు వేయడానికి కొంచెం ఇబ్బంది కల్గింది. ఈ అయస్కాంతశక్తి అందరియందు ఈవిధంగా ఉండదు. దివ్యత్వమునందు మాత్రమే ఇది ఇంత శక్తిమంతంగా ఉంటుంది. రెండు దినములనుండి నాకు నడవటానికి వీలులేకుండా ఉన్నది. అయితే, అది నాకేమీ కష్టం కాదు. దేహమంతా మ్యాగ్నెట్‌గా మారిపోయింది కాబట్టి, అది సహజమే. టంబ్లరును ముట్టుకుంటే అది అట్లే చేతికి కరుచుకునేది. ఇవన్నీ ఇతరులకు చెప్పేవి కావు. ఇలాంటి అయస్కాంత శక్తి ప్రతి మానవునియందున్నది. ఐతే, కొంత పరిమితిలో ఉంటుంది. కాని, దైవత్వంయొక్క శక్తి అపరిమితమైనది.

**దేహమొక కారువంటిది**

వీచే గాలిలో, త్రాగే నీటిలో, తినే తిండిలో, వినే శబ్దంలో, నడిచే నడకలో, చేసే పనిలో ... అన్నింటిలోనూ అయస్కాంతశక్తి ఉంది. అయస్కాంతశక్తి లేని స్థానమే లేదు. "ఎందెందు వెదకిన అందందె గలదు." సర్వం అయస్కాంతమయమే. అయస్కాంతశక్తికి మించిన శక్తియే లేదు. ఇలాంటి శక్తి ఒక్క సత్యములోనే ఇమిడియున్నది. కాబట్టి, సత్యమును మనం కాపాడుకుంటే దైవశక్తి మనలోనే ఆవిర్భవిస్తుంది. "తత్ సత్యం ఉత్తమాధీనం", అటువంటి సత్యము ఉత్తముని హృదయంలో చేరి యుంటుంది. ఉత్తములనగా ఎవరు? శాంతమనస్కులు, ప్రేమహృదయులు, దయాహృదయులు. మానవుల యందు ఈ

srisathyasaivachanamrutam

పవిత్రమైన శక్తులు లేకపోలేదు. కాని, దైవశక్తికోసం ఎక్కడెక్కడో యాత్రలు చేస్తుంటారు. దైవశక్తి తనయందు లేదనే భావముచేతనే ఈరీతిగా యాత్రలు సల్పుతుంటారు. నిజంగా ఆ శక్తి సంపూర్ణంగా వచ్చినప్పుడు ఇంక ఏదీ చేయుటకు వీలుకాదు. బ్రిగెట్ అనే ఒక రష్యన్ మహిళకి పూర్తి అయస్కాంతశక్తి చేరిపోయింది. ఆమె రోడ్డుమీద నడుచుకుంటూ వెళుతుంటే చుట్టూ ఉండే ఇనుము వచ్చి ఆమెకు కరుచుకునేది. ఆమె ఏదైనా షాపుకు వెళితే అక్కడున్న సామానంతా ఆమెకు కరుచుకునేది. అందుచేత, ఆమెను షాపులలోకి అనుమతించేవారు కాదు. ఇలాంటి పరిస్థితిలో ఆమె భోజనంకూడా చేయడానికి వీలుకాక కొన్ని దినములకు మరణించింది. అనగా, ఈ శక్తిని గ్రహించిన తరువాత దానిని కంట్రోల్ చేసుకునే శక్తికూడా కావాలి. అంత దివ్యశక్తి ఆమెయందు ఉన్నప్పటికీ దానిని కంట్రోల్ చేసుకునే శక్తి ఆమెయందు లేకపోవడంచేత మరణించింది. దానిని కంట్రోల్ చేసే శక్తిని ప్రయత్నపూర్వకంగా సాధించాలి. కారును డ్రైవ్ చేసేవాడు దానిని ఎలా కంట్రోల్ చేయాలో తెలుసుకొని ఉండాలి. ఎక్కడ ఎంత స్పీడుగా వెళ్ళాలి, ఎప్పుడు బ్రేకు వేయాలి.. ఇవన్నీ తెలిసినప్పుడే కారును ప్రమాదం లేకుండా డ్రైవ్ చేయగలడు. కంట్రోల్ చేసే శక్తి డ్రైవర్‌కి లేనప్పుడు తాను కారు క్రిందనే పడి చస్తాడు. ఈ దేహము ఒక కారు వంటిది. కన్నులే హెడ్‌లైట్లు, నోరే దీనికి హారన్, మైండే స్టీరింగు, కడుపే పెట్రోలు ట్యాంకు, ధర్మార్థ కామమోక్షములే నాల్గు టైర్లు. ఈ టైర్లలో విశ్వాసమనే గాలి ఉండాలి. ముందు టైర్లలో ఉన్న గాలికి, వెనుక టైర్లలో ఉన్న గాలికి కొంత వ్యత్యాసం ఉండాలి. ఏ టైరులో గాలి ఎక్కువగా ఉందో దానిని తగ్గించాలి, ఏ టైరులో తక్కువగా ఉందో దానికి పంపు కొట్టాలి. కారుయొక్క ట్యాంకులో మలినమైన పెట్రోలు నింపితే అది చెడిపోతుంది. కనుక, పెట్రోలు మలినమైనదిగా ఉండకూడదు. అదేరీతిగా, కడుపులో వేసే ఆహారము పరిశుద్ధమైనదిగా ఉండాలి. దానినే సాత్వికాహారమన్నారు. అంతేకాదు, మనం త్రాగే జలముకూడా పవిత్రమైనదిగా, పరిశుభ్రమైనదిగా ఉండాలి. అప్పుడే ఈ దేహమనే కారు సరియైన స్థితిలో ఉంటుంది, చేరవలసిన గమ్యానికి మిమ్మల్ని చేర్చుతుంది. ఈ దేహతత్త్వాన్ని చక్కగా గుర్తించి వర్తించినప్పుడే మీ జీవితం సార్థకమౌతుంది.

పుట్టుటొక చింత భూమినుండుట చింత
సంసారమొక చింత చావు చింత
బాల్యమంతయు చింత వార్ధక్యమొక చింత
జీవించుటొక చింత చెడుపు చింత
కర్మలన్నియు చింత కష్టములొక చింత
సంతసమొక చింత వింత చింత!

అయితే, సంతోషముగాని, చింతలుగాని మీ భావములపై ఆధారపడి ఉంటాయి. ఈ దేహమువలన చింతలు కల్గుతాయని భావిస్తే నిజంగా చింతలే కల్గుతాయి. ఇది సంతోషాన్ని అందించే పనిముట్టు అని భావిస్తే, నిజంగానే సంతోషాన్ని చేకూర్చుతుంది. మానవునియందు ఏదీ చెడ్డది లేదు. అంతా పవిత్రమైనదిగానే ఉన్నది. మన దేహము ఒక అయస్కాంత మందిరం. కనుక, దీనిని పవిత్రమైన కార్యములలో ప్రవేశపెట్టాలి. ధర్మవిరుద్ధమైన కర్మలను ఆచరించినప్పుడు వాటి ఫలితాలుకూడా చెడ్డవిగానే ఉంటాయి. మానవుడు జపము, ధ్యానము మున్నగు అనేక సాధనలు చేస్తున్నాడు. ఇవన్నీ తాత్కాలిక తృప్తిని కల్గిస్తాయేగాని, దివ్యాకర్షణ శక్తిని గుర్తింపజేయవు. "శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం వందనం అర్చనం దాస్యం స్నేహం ఆత్మనివేదనం," అని నవవిధములైన మార్గములున్నాయి. మీరు భగవంతునియొక్క స్నేహమును కోరాలి. స్నేహమును బలపరచు కున్నప్పుడే ఆత్మనివేదనం సాధ్యమౌతుంది. అంతవరకు [illegible] (శరణాగతి) సాధ్యం కాదు.

అయస్కాంత మందిరములే దేవాలయములు. ఎక్కడెక్కడ ఏఏ దేవాలయములున్నాయో వాటిలో ఉన్నదంతా అయస్కాంతశక్తియే. తిరుపతిలో గొప్ప శక్తి ఉన్నదని అంటున్నాము. అది వేంకటేశ్వర స్వామి శక్తి కాదు; భక్తులు భక్తిప్రపత్తులనే అయస్కాంతశక్తిని తీసికొనిపోయి అక్కడ వదలిపెడుతున్నారు. అక్కడ ఆకర్షణశక్తి ఉన్నది, రమింపజేసే శక్తి ఉన్నది. అందువల్లనే అక్కడ పెద్ద శక్తిగా రూపొందుతున్నది. మీరు ఏ దేవాలయమునకు వెళ్ళినప్పటికీ అక్కడున్న శక్తి అంతా అయస్కాంతశక్తియే. అదియే [illegible]

sri sathyasai vachanamrutam

⊠ (దైవశక్తి). ఆ శక్తిని మీరు సంపాదించుకోవాలి. అది దేవాలయములందు తప్ప అన్యప్రదేశములందు కనిపించదు. ఎందు కంటే, అక్కడ దేవుడు, పూజారి, అతడు చేసే పూజలు, అర్పించే పూలు, జలము, అక్షతలు... ఇవన్నీ అయస్కాంతశక్తితో కూడినవి. కనుకనే, అక్కడికి వెళ్ళినవారిని తక్షణమే అవి ఆకర్షిస్తాయి.

**మానవప్రయత్నం - దైవసంకల్పం**

అయస్కాంత మందిరమైన మన దేహాన్ని పవిత్రమైన మార్గంలో ప్రవేశపెట్టాలి. అనవసరంగా ఇతరులపై కోపాన్ని ప్రదర్శించినప్పుడు, ఇతరులను ద్వేషించినప్పుడు, ఇతరులను చూసి అసూయ పడినప్పుడు మనలోని అయస్కాంతశక్తి వ్యర్థమైపోతుంది. శబ్దము, కాంతికిరణములు కూడా అయస్కాంత మహిమలే. ఎక్కడో ఢిల్లీ రేడియో స్టేషన్లో మాట్లాడిన మాటలు తక్షణమే ఇక్కడ వినిపిస్తున్నాయి. ఈ శబ్దతరంగాలను ఏది గొనివస్తున్నది? అయస్కాంతశక్తియే. ఏ సైంటిస్టులుగాని, ఏ ఇంజనీర్లుగాని దీనిని అర్థం చేసుకోలేరు. జీర్ణకోశమునందు ఆహారము ఏరీతిగా జీర్ణ మౌతున్నది? మన గుండె నిమిషానికి ఇన్ని పర్యాయములు కొట్టుకోవాలని ఎవరు నిర్ణయం చేశారు? వీటిని సైంటిస్టులు అర్థం చేసుకోలేరు. ఇదంతా దైవనిర్ణయమే. ఈనాటి డాక్టర్లు తాము అంతా కనిపెట్టామని విఱ్ఱవీగుతున్నారుగాని, నిజానికి వీరు కనిపెట్టిందేమీ లేదు. గుండె ఎట్లా ఆడుతున్నదో కనిపెట్టారుగాని, ఎందుకు ఆడుతున్నది? దానిని ఎవరు ఆడిస్తున్నారు? అనే విషయాలు వారికి తెలియవు. దేహములోని సర్వాంగములలోనూ రక్తము సంచరిస్తున్నది. దీనికి ఏది మూలకారణమో వారికి తెలియదు. మానవప్రయత్నం వలన ఇది సాధ్యంకాదు; దైవమే ఇదంతా జరుపుతున్నాడు. "నేను చేస్తున్నాను" అనే అహంకారమువల్లనే మానవుడు సత్యాన్ని తెలుసుకో లేకపోతున్నాడు. పండిన వడ్లను మనం అట్లే తినలేము. వాటిని దంచి పొట్టుతీసి పాత్రలో వేసి వండిన తరువాతనే భుజించగల్గు తున్నాము. వడ్లను బియ్యంగా మార్చి భుజించే స్థితికి తెప్పించు కోవడమే సంస్కారమన్నారు. ఇది మన ప్రయత్నంచేత జరుగుతున్నది. కాని, సృష్టి మాత్రం దైవసంకల్పంచేతనే జరుగుతున్నది. కనుక, మానవుడు దైవశక్తిపై విశ్వాసము పెట్టుకోవాలి. కాని, కొందరు మూర్ఖులు దైవమే లేదంటారు. అయితే,

srisathyasai vachanamrutam

అలాంటివారు కూడా ఈ సృష్టి వెనుక ఏదో ఒక శక్తి ఉందని అంటారు. ఆ శక్తికే దైవమని పేరు. ఆ శక్తి లేకపోతే మానవుడు ఏ పనీ చేయలేడు. మానవుడు ఏవిధంగా మాట్లాడగల్గుతున్నాడు? ఆ శక్తి తనకు ఎక్కడినుండి వచ్చింది? అదియే దైవశక్తి.

**"ఏకం సత్ విప్రాః బహుధా వదంతి"**

నేనింతకుముందు చెప్పినట్లుగా, మెటీరియలైజేషన్, వైబ్రేషన్, రేడియేషన్... ఈ మూడింటి చేరికయే మానవుడు. రేడియేషన్, వైబ్రేషన్‌లవలననే దేహమనే మెటీరియలైజేషన్ పనిచేయగల్గుతున్నది. కర్మయోగానికి దేహమే ఆధారం. చింతన చేయడానికి వైబ్రేషనే ఆధారం. ఈ రెండింటికీ చైతన్యం కల్గించేది రేడియేషన్. దీనినే వేదము "ప్రజ్ఞానం బ్రహ్మ" అన్నది. ఇదే [illegible] దీనికి రాత్రి, పగలు అనే భేదం లేదు. ఇది జాగ్రత్స్వప్నసుషుప్తుల కతీతమైనది, అన్ని కాలములందూ ఒక్కటిగానే ఉంటుంది. దీనినే వేదము "ఏకం సత్ విప్రాః బహుధా వదంతి" అన్నది. ఇది సత్యస్వరూపమైనది. అయితే, భక్తుల అభీష్టాన్ని బట్టి రామునిగా, కృష్ణునిగా, ఈశ్వరునిగా... ఏ రూపాన్నైనా ధరించవచ్చు. ఈ రూపనామాలన్నీ మన భ్రాంతులే. దివ్యత్వానికి ఒక ప్రత్యేకమైన రూపము లేదు. నీటికి ఏ రూపముంది? ఏ పాత్రలో పోస్తే ఆ పాత్రయొక్క రూపాన్ని ధరిస్తుంది. గాలికి ఏ రూపముంది? బెలూన్‌లో నింపితే అది బెలూన్ రూపాన్ని ధరిస్తుంది, ఫుట్‌బాల్‌లో నింపితే ఫుట్‌బాల్ రూపాన్ని పొందుతుంది. అదేరీతిగా, దివ్యత్వానికి ఎట్టి రూపమూ లేదు. రూపనామాలను మనమే కల్పించుకుంటున్నాము. ఇవన్నీ మధ్యలోనే మాయమౌతాయి. ఈ రూపనామాలన్నింటికీ ఆధారమైన దివ్యత్వాన్ని విశ్వసించండి.

మీరు దేనినైనా మరువవచ్చు, వదలవచ్చు. కాని, దైవత్వాన్ని మాత్రం మరువకండి. దైవత్వాన్ని మరచినవాడు తనను తానే మరచినవాడౌతాడు. పురాణకాలమందు ప్రజలు భక్తివిశ్వాసములతో నిరంతరం దైవాన్ని స్మరిస్తూ ఉండటంచేత ఒక్కొక్కరు 110 - 120 సం॥లు జీవించేవారు. వారికి ఎట్టి రోగములూ రాలేదు. వారు తినే తిండికూడా చాలా సామాన్యమైనదే. విటమిన్ ఎ, విటమిన్ బి అంటే ఏమిటో, ప్రోటీన్లంటే ఏమిటో వారికి

sri sathyasai vachanamrutam

తెలియదు. ఆహారాన్ని భగవదర్పితం గావించి భుజించడంచేత వారికి అవసరమైన విటమిన్లు, ప్రోటీన్లు అందులో లభించేవి. దైవవిశ్వాసమును పెంచుకుంటే దేనినైనా సాధించవచ్చు, మీరే దైవస్వరూపులు కావచ్చు. అసలు దైవం మీకంటే వేరుగా లేదు. ఇదే వేదాంతసారం. దీనిని గుర్తించి వర్తించినప్పుడే మీకు దివ్యత్వం ప్రాప్తిస్తుంది.

*(స్వామి తాము సృష్టించిన సువర్ణలింగాన్ని చూపిస్తూ)* చూడండి, దీని సైజు పెద్దదిగా ఉన్నది. దీనికొక అంతరార్థము లేకపోలేదు. దీని బరువు ఐదు తులాలు. మన దేహములోకూడా ఐదు తులాల సువర్ణరసమున్నది. దీనినే హిరణ్యగర్భుడన్నారు. మీకు తెలిసియుండ వచ్చు – వైద్యులు ఒక్కొక్కసారి సువర్ణము కలిపిన మందులిస్తారు. సువర్ణమే మానవునికి ప్రధానమైన శక్తి. సువర్ణమువలననే మానవునిలో తేజస్సు ప్రకాశిస్తూ ఉంటుంది. మన దేహములోని బంగారమంతా ఇంతమాత్రమే. కన్నులలో ప్రవేశించి కాంతిని కలిగించేది ఇదియే. దీనివల్లనే చెవులు వినగల్గుతున్నాయి, నాలుక రుచి చూడగల్గుతున్నది. ఈ సువర్ణరసము దేహమంతా సంచరిస్తూ కాపాడుతూ ఉంటుంది. మన చర్మము క్రింద అత్యంత పలుచనైన తెల్లచర్మం ఉంటున్నది. అది కట్ అయినప్పుడే రక్తం వస్తుంది, లేకపోతే రాదు. మన రక్తమును కాపాడేందుకే భగవంతుడు ఈ తెల్లచర్మమును ఏర్పాటు చేశాడు. భగవంతుడు ఏది చేసినా మన రక్షణకోసమే, మన క్షేమంకోసమే. దైవసృష్టిలో ఎంతో విచిత్రమైనవి ఉన్నాయి.

**చిత్రంబులు త్రైలోక్య ప**
**విత్రంబులు భవలతాలవిత్రంబులు స**
**న్మిత్రంబులు మునిజనవన**
**చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్**

అని బోధించింది భాగవతము. ఆనాటి గోపికలు పరిపూర్ణమైన నమ్మకం చేతనే తరించారు. నమ్మకమనే అయస్కాంతశక్తి వారిలో నిండి యుండటంచేత వారు కృష్ణుని అనుగ్రహానికి పాత్రులయ్యారు.

*“అత్తలు మొత్తుకున్న మరి భర్తలు కత్తులు నూరుచున్న నోరెత్తరు, కోపగించరు, ఎటకేగరు,*

*భీతిలబోరు గోపికల్, పొత్తములందున చిత్తరువు రీతిగ నుండె వారిలో కృష్ణుడు...”*

కాగితాన్ని, దానిపై ప్రింటైన బొమ్మను వేరుచేయడానికి వీలుకాదు కదా! అదేరీతిగా, గోపికలు తమ హృదయాలలో కృష్ణరూపాన్ని ముద్రించు కున్నారు. అనేక జన్మల పుణ్యఫలముచేతనే దైవంపై ఇట్టి దృఢమైన విశ్వాసం కల్గుతుంది.

“రసోవై సః”, భగవంతుడు రసస్వరూపుడు. ప్రేమరసమును మించిన రసము మరొకటి లేదు. ప్రేమలో అనేకరకములైన రుచులున్నాయి. ఒక్క రుచి కాదు, మనకు తెలియని రుచులు అనేకం ఉన్నాయి. తన్మయత్వం కల్గించే రుచి ఉంది, పవిత్రతను చేకూర్చే రుచి ఉంది, ఉన్మత్తులను గావించే రుచి ఉంది. కనుకనే, నారదుడు భగవంతుని ప్రేమతత్వాన్ని వర్ణిస్తూ “యల్లబ్ధ్వా పుమాన్ ఇచ్ఛారామో భవతి, తృప్తో భవతి, మత్తో భవతి, ఆత్మారామో భవతి...” అన్నాడు. ఇట్టి ప్రేమను పొందిన మానవుని జన్మమే జన్మము. ఈ ప్రేమను పొందే నిమిత్తం మీయందు ప్రేమ అనే అయస్కాంతశక్తిని అభివృద్ధి పరచుకోండి. అప్పుడు మీరు ఏది చదివినా అది తక్షణమే మీ హృదయానికి హత్తుకొనిపోతుంది. మీలో అయస్కాంతశక్తియే లేకున్న రాత్రింబవళ్ళు మీరు ఎంత కష్టపడి చదివినా ప్రయోజనం లేదు; నిద్రాదేవికి మీరు లొంగిపోతారు; కుంభకర్ణుడు వచ్చి “రండి బ్రదర్” అని పిలుచుకొనిపోయి మిమ్మల్ని నిద్రలో ముంచుతాడు. అయస్కాంత శక్తియే మీలో ఉంటే నిద్రాదేవి, కుంభకర్ణుడు మీవైపుకే చూడరు.

**పుస్తకముల్ పఠించితిని పూర్తిగజూచితి సర్వ శాస్త్రముల్**
**నిస్తులమైన విద్యలను నేర్చితినంచును గర్వమేల? నీ**
**హస్తయుగంబు మోడ్చి పరమాత్మను భక్తితొ కొల్వలేని యీ**
**ప్రస్తుత విద్యలన్నియును పాడగు విద్యలె చూడ మానవా!**

భగవంతుణ్ణి విస్మరిస్తే ఎంత చదివినా ఏమి ప్రయోజనం? దినమునకు ఒక్క పర్యాయమైనా భగవంతుణ్ణి స్మరించండి. మూర్ఖుల మాటలను మీరు పట్టించుకోకండి. దేవుడు లేదని ఎవరైనా అంటే మీరు వెంటనే ప్రశ్నించండి – “ఎవరి దేవుడు? నీ దేవుడా? నా దేవుడా? నీ దేవుడు నీకు లేకపోవచ్చును. కాని, నా దేవుడు లేదని చెప్పడానికి నీకేమి

sri sathyasai vachanamrutam

అధికారమున్నది?" ఈవిధమైన దృఢవిశ్వాసంతో వారిని ఎదుర్కోవాలి. ఎవరి నమ్మకం వారిది. కాని, ఈనాడు "నమ్మకమను రెండు నయనమ్ములే లేని అంధులైరి మనుజులవని యందు." జీవితాన్ని సార్థకం గావించుకునే నిమిత్తం దైవవిశ్వాసాన్ని పెంచుకోండి. సర్వకాల సర్వావస్థలయందు ఆ నమ్మకమే మిమ్మల్ని రక్షిస్తుంది. ఈనాటి పిల్లలు రక్షించే దైవవిశ్వాసాన్ని వదలిపెట్టి శిక్షించే దుర్భావాలను పెంచుకుంటున్నారు. పిల్లలైనా, పెద్దలైనా ఎవరైనా సరే, దుర్భావాలను చేర్చుకోకూడదు. పరులను విమర్శించ కండి. పరులకు అపకారం చేయకండి. మీరు పరులను హింసిస్తే అంతకు పదిరెట్లు అధికంగా మీరు హింసకు గురి కావలసివస్తుంది. మీకే కాదు, మీ కుటుంబానికికూడా ఆ పాపం తగులుతుంది. ఈ సత్యాన్ని మరువకండి. మీరు అందరి క్షేమాన్ని కోరినప్పుడే భగవంతుడు మిమ్మల్ని, మీ కుటుంబాన్ని క్షేమంగా చూస్తాడు. కనుక, మీరు సద్భావాలను పెంచుకొని దైవచింతనచేత కాలాన్ని సార్థకం గావించుకోండి.

(2002 మార్చి 13వ తేదీ ఉదయం సాయి కుల్వంత్‌సభామండపంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)

sri sathyasai vahamrutam